క్లుప్తంగా

నర్సింగ్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

దుగ్గిరాల: రాష్ట్రంలోని నర్సింగ్ కళాశాలల్లో బీఎస్సీ 4 ఏళ్ల డిగ్రీ కోర్సుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని మార్తా నర్సింగ్ కళాశాల చైర్మన్ యనమల ఈశ్వర్ తెలిపారు. తుమ్మపూడి గ్రామంలోని కళాశాలలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఈ కోర్సు అందుబాటులో ఉన్న కన్వీనర్, మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీకి సంబంధించి కామన్ ఎంట్రన్స్ పరీక్ష ఉంటుందని విజయవాడ ఎన్టీఆర్ ఆరోగ్య యూనివర్సిటీ తెలిపిందని అన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. గత విద్యా సంవత్సరం ఎంసెట్, నీట్ ద్వారా ప్రవేశం ఉండేదని.. నూతన విధానం ద్వారా ఏపీ నర్సింగ్ టెస్ట్ ద్వారా సీట్ల భర్తీ ఉంటుందని అన్నారు. ఈ విషయం గుర్తుంచుకొని వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. జూలై 6న అర్హత పరీక్ష ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

వీరాంజనేయునికి విశేష పూజలు



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని వీరాంజనేయస్వామి ఆలయంలో జీవధ్వజ ప్రతిష్ఠ 8వ వార్షికోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృత స్నపన, అష్టోత్తర సహస్ర నామపూజలను అర్చకులు నారాయణం ప్రసాదాచార్యులు, వంశీకృష్ణలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు స్నపన, తిరువంజనం నిర్వహించారు. హనుమాన్‌సూరి ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో పఠించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదానం నిర్వహించారు.

కాజలో ఏరువాక పౌర్ణమి రేపు

కాజ(మంగళగిరి): మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాజ గ్రామంలో మంగళవారం ఏరువాక పౌర్ణమి కార్యక్రమం నిర్వహించనున్నట్లు గ్రామ పెదకాపులు ఆదివారం తెలిపారు. కాజలోని శ్రీ అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం వేడుకల వివరాలను వెల్లడించారు. పౌర్ణమి సాయంత్రం గ్రామ సెంటర్‌లోని శ్రీ రత్న గర్భ విఘ్నేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లతో ఏరువాక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవంలో గుడికి నాలుగు వైపుల గల స్తంభాల మీద నుంచి ఉండ్రాళ్లను స్వామివారి ప్రసాదంగా భక్తులకు పంచిపెట్టనున్నారు. కార్యక్రమంలో ఉత్సవ పెదకాపులు సింహాద్రి వెంకటరామారెడ్డి, కుక్కల కోటేశ్వరరావు, చెన్నం శ్రీనివాసరావు, బొమ్ము పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన విరామ బైబిల్ తరగతులు



దుగ్గిరాల: ఈమని గ్రామంలో రక్షణ సైన్యం ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్న బైబిల్ విరామ పాఠశాల తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈ కార్యక్రమాలకు హాజరైన 250 మంది చిన్నారులకు నిర్వాహకులు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. అనంతరం విశ్వాసులు పాటలు, బైబిల్ కథలను బోధించారు. కార్యక్రమంలో వెంకట్రావు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

15న 'కేసన'కు సత్కారం



తెనాలి: ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావుకు ఈనెల 15న తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో అభినందన సత్కారం జరగనుంది. పలు బీసీ సంఘాల ఆధ్వర్యంలో జరగనున్న కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను ఆదివారం సాయంత్రం స్థానిక ముత్యంశెట్టిపాలెంలోని పద్మశాలీయ కల్యాణ మండపంలో ఆవిష్కరించారు. చినరావూరు వాకర్స్ సొసైటీ కార్యదర్శి జొన్నాదుల నరసింహారావు మాట్లాడుతూ జనాభా లెక్కలతోపాటు కులగణన చేపట్టాలంటూ బీసీ సంక్షేమ సంఘం తరఫున కేసన శంకరరావు దీర్ఘకాలంగా ఉద్యమిస్తున్నారనీ, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేసినట్టు గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం కులగణనకు సిద్ధమైన తరుణంలో కేసన శంకరరావును సత్కరించనున్నట్టు తెలిపారు. ఇదే సభలో శంకరరావు అభినందన సంచికను విడుదల చేస్తామన్నారు. సభకు కేంద్ర, రాష్ట్రమంత్రులు హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో ఓంకార్ ప్రసాద్, అక్కల వెంకటేశ్వరరావు, షేక్ అబ్దుల్ హకీం జాని, బి.నరసింహారావు, ఎ.సాంబశివరావు, ఎం.మల్లికార్జునరావు, సీహెచ్. సాంబశివరావు, ఎ.ఏడుకొండలు, ఈఎల్‌వీ అప్పారావు, పూర్ణచంద్రరావు, ఎస్.సతీష్ పాల్గొన్నారు.

అలంకార ప్రాయంగా ఫస్ట్ ఎయిడ్ బాక్సులు!

- ఫస్ట్ ఎయిడ్ బాక్స్ నిర్వహణ అధ్వానం
- అమలు కాని మోటారు వాహన చట్టం
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు

మంగళగిరి టౌన్: ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం.. అంటూ ప్రకటనలు గుప్పిస్తున్న రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సుల్లో ప్రథమ చికిత్స బాక్సు(ఫస్ట్ ఎయిడ్ బాక్స్)ల ఏర్పాట్లలో నిర్లక్ష్యం వహిస్తోంది. బస్సు ప్రమాదానికి గురైతే అప్పటికప్పుడు తాత్కాలిక వైద్య సేవలు పొందేందుకు ప్రతి ఆర్టీసీ బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఉండాలి. ప్రస్తుతం అటువంటివి బస్సుల్లో కానరావడం లేదు. బస్సు షడన్ బ్రేక్ వేసినప్పుడు ప్రయాణీకులకు చిన్నపాటి గాయాల తగిలితే వారు దగ్గరలో ఉన్న ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

ఖాళీగా ఫస్ట్ ఎయిడ్ బాక్సులు..

ఆర్టీసీ బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సులు అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. ఆర్టీసీ బస్సులో ఉన్న ప్రథమ చికిత్స బాక్సుల్లో ప్రథమ చికిత్సకు అవసరమైన మందులు మచ్చుకైనా కనిపించడం లేదు. కొన్ని బస్సుల్లో గడువు తీరిన మందులు, మరికొన్ని బస్సుల్లో ఖాళీ బాక్సులు, కొన్ని బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సులో ఇతర వస్తువులు కనిపిస్తున్నాయి. మరికొన్ని బస్సుల్లో అయితే ఫస్ట్ ఎయిడ్ పేరు తప్ప బాక్సులు లేకుండా పోయాయి. దీంతో ప్రయాణీకుల భద్రతపై దృష్టి సారించాలని.. రాష్ట్ర ప్రభుత్వం ఫస్ట్ ఎయిడ్ బాక్సుల్లో మందుల కొనుగోలుకు నిధులు మంజూరు చేయాలని పలువురు ప్రయాణీకులు కోరుతున్నారు.

అమలు కాని చట్టం..

కేంద్ర మోటారు వాహన చట్టం 1939 ప్రకారం ప్రయాణీకుల వాహనాల్లో విధిగా ప్రథమ చికిత్స బాక్సులు ఏర్పాటు చేయాలి. ఈ చట్టాన్ని మరింత పటిష్ఠం చేస్తూ 1988లో మరిన్ని సవరణలు చేశారు. నిబంధనల ప్రకారం ప్రథమ చికిత్సకు అవసరమైన మందులు, ఇతర వస్తువులను ప్రథమ చికిత్స బాక్సుల్లో ఉంచాలి. లైసెన్స్ పొందే ముందు బస్ డ్రైవర్, కండక్టర్ వారం రోజుల పాటు ప్రథమ చికిత్స చేయడంపై శిక్షణ పొందాలని.. ప్రతి మూడేళ్లకు ఒకసారి లైసెన్స్‌ను పునరుద్ధరించుకోవాలని చట్టం నిర్దేశిస్తోంది. ప్రయాణీకులు గాయపడితే వారికి ప్రథమ చికిత్స చేసే సామర్థ్యం బస్సు డ్రైవర్, కండక్టర్లకు ఉంటుంది. రవాణా శాఖ అధికారుల నుంచి బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికేట్ పొందే సమయంలో మాత్రమే మొక్కుబడిగా ప్రథమ చికిత్స బాక్సులు చూపుతున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి.





గవర్నర్‌పేట డిపో, మంగళగిరి డిపో ఆర్టీసీ బస్సుల్లో ఖాళీగా ఉన్న ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లు



ఆర్టీసీ బస్సులో కనిపించని ఫస్ట్ ఎయిడ్ బాక్స్

మందులు అందుబాటులో ఉంచుతాం..

ఆర్టీసీ బస్సుల్లో ప్రథమ చికిత్స బాక్సుల్లో అవసరమైన మందులు ఉండేలా డ్రైవర్లు, కండక్టర్లకు సూచించాం. ఫస్ట్ ఎయిడ్ బాక్సులకు తాళాలు వేసి అత్యవసర సమయాల్లో తెరచి చికిత్స చేయాలి. ప్రతి నెలా ఫస్ట్ ఎయిడ్ బాక్సులను తనిఖీ చేసుకుని గడువు తీరిన మందుల స్థానంలో కొత్తవి ఉంచాలి. ఈ విషయంలో డ్రైవర్లు, కండక్టర్లు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుంటాం. –రెంటపల్ల పిచ్చయ్య, ఆర్టీసీ డిపో మేనేజర్, మంగళగిరి



ముగిసిన ఫ్యాక్టరీ ప్రీమియర్ లీగ్ పోటీలు

విజేతలకు బహుమతులు ప్రదానం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం హైస్కూల్‌లో గత 15 రోజులుగా జరుగుతున్న ఫ్యాక్టరీ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎస్పీ శాంతిరాజ్ విచ్చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించేందుకు ఈ తరహా టోర్నమెంట్‌లు యువతకు మంచి అవకాశాలను కల్పిస్తాయని అన్నారు. మొత్తం 50 జట్లు పాల్గొనగా, బీఎస్ఆర్ 11 వర్సెస్ రెడ్ చిల్లీస్ జట్టు మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో బీఎస్ఆర్11 జట్టు విజేతగా నిలించింది. అనంతరం తెలుగు యువత ఉపాధ్యక్షుడు జంగాల వెంకటేష్ సహకారంతో నగదు బహుమతులను అందజేశారు. డీఎస్పీ శాంతిరాజ్, ముమ్మిడి సత్యనారాయణ చేతుల మీదుగా ప్రథమ స్థానంలో నిలిచిన బీఎస్ఆర్ జట్టుకు రూ. లక్ష బహుమతిని, ద్వితీయ స్థానంలో నిలిచిన రెడ్ చిల్లీస్ జట్టుకు రూ. 50 వేల బహుమతిని, తృతీయ స్థానంలో నిలిచిన వల్లభనేని వెంకటరావు జట్టుకు రూ.25 వేలను అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన కొర్రపాటి అశోక్ కుమార్‌కు రూ.10వేలు, బెస్ట్ బ్యాట్స్‌మెన్ కొర్రపాటి అశోక్‌కుమార్‌కు రూ.5 వేలు, బెస్ట్ బౌలర్‌గా నిలిచిన ప్రశాంత్‌కు రూ.5 వేలు నగదు బహుమతులు అందజేశారు. విజేతలకు ట్రోఫీలను అందజేశారు. తాడేపల్లి ఎస్ఐ ఖాజావలి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఎస్పీ శాంతిరాజ్

ఈ ఏడాదైనా 'అన్నదాత సుఖీభవ' ఉందా ?

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి

తెనాలి: అన్నదాత సుఖీభవ పథకంలో రూ.20 వేల ఆర్థికసాయం ప్రతి రైతుకు, కౌలు రైతుకు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రూరల్ మండల గ్రామం గుడివాడలో కౌలు రైతులు, రైతులను ఆయన కలిసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే భూ యజమానులకు అన్నదాత సుఖీభవ ఇచ్చినా గానీ కౌలు రైతులకు కూడా అదే పథకం కింద ఆర్థికసాయం ఇస్తామని చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరం అసలు ఆ పథకం అమలు చేయలేదని తెలిపారు. ఈ సంవత్సరం జూన్‌లో ఇస్తామని హామీలు గుప్పించటం మినహా, ఆచరణలో ఇస్తారా? లేదా? అనే ఆందోళన కౌలు రైతుల్లో నెలకొందని పేర్కొన్నారు. మరోవైపు ప్రభుత్వం జొన్నలు, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన చెందారు. దీంతో దళారులు తక్కువ ధరకు పంటను కొనుగోలు చేసి లబ్ధి పొందుతున్నారని చెప్పారు. భూమి యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా గ్రామసభల ద్వారా కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. వాస్తవ సాగుదారుల పేరుతోనే ఈ-క్రాప్ నమోదు చేయాలని విన్నవించారు. కౌలు రైతులు, సాగుదారుల పంట రుణాలను రీ షెడ్యూల్ చేసి కొత్తగా ఇవ్వాలని కోరుతూ ఈ నెల 11న మంగళగిరి వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం వద్దకు రావాలని ఆయన కోరారు. రైతు సంఘం డివిజన్ అధ్యక్షుడు ముద్దన సాంబశివరావు మాట్లాడుతూ మంగళగిరి ఎన్ఆర్ఐ హాస్పిటల్ వద్ద నుంచి ర్యాలీగా వెళ్లి సీసీఎల్ఏ, వ్యవసాయ శాఖ కమిషనర్లకు వ్యక్తిగత అర్జీలతో పాటు వినతి పత్రాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. కౌలు రైతులందరూ అర్జీలు తీసుకురావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జ్యోతుల కోటేశ్వరరావు, బండి సుధాకర్‌రావు, మోషే, గొట్టిముక్కల ప్రేమయ్య పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న శివసాంబిరెడ్డి

యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి

తెనాలి అర్బన్: యోగాంధ్ర కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పిలుపునిచ్చారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఆదివారం యోగా శిక్షణ తరగతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యోగాకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 21వ తేదీన విశాఖపట్నంలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు చెప్పారు. తహసీల్దార్ గోపాలకృష్ణ మాట్లాడుతూ యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతతో పాటు శారీరక రుగ్మతలు దూరమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో దీప్తి, పలువురు యోగా సాధకులు, వృద్ధులు పాల్గొన్నారు.



యోగా చేస్తున్న మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

మల్టీపర్పస్ ఫంక్షన్ హాలుకు శంకుస్థాపన

కుంచవరం(తెనాలి): పట్టణానికి చెందిన 'పోస్ట్' స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో కొల్లిపర మండలం కుంచవరంలోని సామాజిక ప్రాంగణంలో మల్టీపర్పస్ ఫంక్షన్ హాలు నిర్మాణానికి ఆదివారం పెనుగొండ పీఠాధిపతి స్వామి ప్రజ్ఞానంద సరస్వతి (బాల స్వామీజీ) శంకుస్థాపన చేశారు. సామాజిక ప్రాంగణంలో విద్యార్థులకు విలువలతో కూడిన విద్య, ఉపాధి శిక్షణ, మహిళా సాధికారత కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అదే ప్రాంగణంలో నిర్మిస్తున్న వారాహి అమ్మవారి దేవస్థానం పనులు శరవేగంగా జరుగుతున్న తరుణంలో మరిన్ని సేవా కార్యక్రమాల నిమిత్తం ఫంక్షన్ హాలు నిర్మాణాన్ని చేపట్టినట్టు సంస్థ బాధ్యులు తన్నీరు శ్రీనివాస బాబు, నాగమల్లేశ్వరి చెప్పారు. కార్యక్రమంలో యోగ గురువు ముద్దాభక్తుని రమణయ్య, రావూరు సుబ్బారావు, హరిప్రసాద్, వక్కలగడ్డ రాంబాబు, 'కళారత్న' కాటూరి వెంకటేశ్వరరావు, కాటూరి రవి చంద్ర పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న స్వామి ప్రజ్ఞానంద సరస్వతి

లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

మంగళగిరి టౌన్: కార్మిక హక్కులను కాలరాసే విధంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని ఎయిమ్స్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎస్ఎస్ చెంగయ్య డిమాండ్ చేశారు. మంగళగిరి నగర పరిధిలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం యూనియన్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెంగయ్య మాట్లాడుతూ లేబర్ కోడ్స్ రద్దు చేయాలని అన్నారు. జూలై 9వ తేదీన నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో మోదీ ప్రభుత్వ విధానాలను బలపరుస్తూ కూటమి ప్రభుత్వం 8 గంటల పని విధానాన్ని 12 గంటలకు మారుస్తూ రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని విమర్శించారు. ఈ నిర్ణయాన్ని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం 21 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఎం.బాలాజీ, అధ్యక్షులు పరమేష్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బుజ్జిబాబు, ఉపాధ్యక్షులుగా కిరణ్, నాగేశ్వరరావు, జ్యోతి, కోశాధికారిగా శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా రవికుమార్, మనోజ్‌బాబులు ఎన్నికయ్యారు.

యువతి అదృశ్యం

తెనాలి రూరల్: యువతి అదృశ్యంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణ నందుల పేటకు చెందిన ఓ యువతి శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు టూ టౌన్ పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి 'బొల్లిముంత'

తెనాలి: ప్రజల అభ్యుదయమే ఆశయంగా అగ్రశ్రేణి రచనలు చేసిన ప్రజా రచయిత బొల్లిముంత శివరామకృష్ణ చిరస్మరణీయులని రచయిత రంగిశెట్టి రమేష్ అన్నారు. గాంధీనగర్ 'ఇస్కఫ్' కార్యాలయంలో ఆదివారం అభ్యుదయ కళా సమితి ఆధ్వర్యంలో జరిగిన శివరామకృష్ణ సాహిత్య గోష్ఠికి ఆయన అధ్యక్షత వహించారు. ఉపాధ్యాయునిగా జీవితాన్ని ఆరంభించి, హార్మోనిస్టుగా, నటుడుగా, గాయకుడిగా, కవి, కథా రచయిత, నవలాకారుడు, బుర్రకథ, హరికథ రచయిత, జర్నలిస్టు, సినిమా రచయిత, అరసం నాయకుడుగా శివరామకృష్ణ బహుముఖాలుగా సమాజ శ్రేయస్సుకు కృషి చేశారని సోదాహరణంగా చెప్పారు. ఆలిండియా గ్రామీణ డాక్ సేవిక్స్ యూనియన్ జాతీయ అధ్యక్షుడు బీవీ రావు మాట్లాడుతూ శివరామకృష్ణ మాటలు రాసిన 'నిమజ్జనం' సినిమాకు రాష్ట్రపతి అవార్డు రాగా, 'కాలం మారింది' చిత్రానికి రాష్ట్ర ప్రభుత్వ అవార్డు లభించిందని చెప్పారు. మహాత్మా గాంధీ సేవా శాంతి ఆశ్రమం వ్యవస్థాపకుడు వజ్రాల రామలింగాచారి, ఆళ్ల నాగేశ్వరరావు, కనపర్తి బెన్‌హర్, ఎంపీ రఘునాథరావు, కె.విజయసారథిబాబు, వినుకొండ శ్రీరామమూర్తి, చందు సూర్య, వీణ, విజయలక్ష్మి, బొల్లిముంత కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 20 మంది కవులతో కవితా గానం జరిపారు.



మాట్లాడుతున్న రచయిత రమేష్

వివేక విద్యార్థి పవన్ కుమార్‌కు 434 ర్యాంక్

తెనాలి: ఈఏపీసీఈట్–2025 ఇంజినీరింగ్ ఫలితాల్లో స్థానిక వివేక విద్యా సంస్థల విద్యార్థి టీవీ పవన్‌కుమార్ ఓపెన్ కేటగిరిలో 434వ ర్యాంకు సాధించాడు. ఈ విద్యార్థి ఐఐటీ జేఈఈ మెయిన్స్‌లో 99.37 పర్సంటైల్, ఐఐటీ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో 4,759 ర్యాంకుతో అడ్మిషన్లకు అర్హత సాధించినట్టు వివేక విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ వెల్లడించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను వివేక పబ్లిక్ స్కూలులో స్వామీజీ భాస్కరానంద సరస్వతి సత్కరించారు. పవన్‌తోపాటు తమ విద్యార్థి ఎస్.జస్వంత్ 2,742 ర్యాంక్, ఓంకార్ బాలాజీ, జ్ఞానకార్తిక్, లక్ష్మీ మౌనిక, షేక్ ఫరీదాల సహా మరో 10మంది పదివేల లోపు ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. దుర్గాప్రసాద్, గణేష్, చైతన్య, కబీర్‌ఖాన్, మోషే సహా 15 మంది విద్యార్థులు 15 వేలలోపు ర్యాంకులు సాధించినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ జ్యోతి, శ్రావణి, డీన్ ఎస్.శ్రీనివాసరావు, పీడీ సునీల్, మురళి, రాంబాబు, ఠాగూర్, లావణ్య, రోజా, అనూరాధ పాల్గొన్నారు.



జూలై 10 నుంచి టౌన్ చర్చి శత వార్షికోత్సవాలు

తెనాలి: స్థానిక బోసు రోడ్డులోని ఆంధ్ర ఇవాంజిలికల్ లూథరన్ సంఘం–తూర్పు గుంటూరు సినడ్ క్రీస్తు దేవాలయం (టౌన్ చర్చి) శత వార్షికోత్సవాలకు అంకురార్పణ చేశారు. చర్చి ప్రాంగణంలో జులై 10,11,12 తేదీల్లో జరగనున్న ఈ ఉత్సవాల పోస్టరును ఆదివారం ఆవిష్కరించారు. ప్యారిష్ పాస్టర్ రెవరెండ్ దేవరపల్లి యేసురత్నం, అడిషనల్ పాస్టర్లు యామర్తి లెనిన్‌బాబు, దగుగ్మల్లి సాల్మన్‌రాజు, వీబీ ప్రకాష్‌బాబు మత్తె, అడ్‌హాక్ కమిటీ సభ్యులు ఐనంపూడి డేవిడ్‌రాజు, డాక్టర్ శ్యామ్‌ప్రకాశరావు గారపాటి, చల్లాపల్లి ఫ్రాన్సిస్ జేవియర్, సుదర్శనం జాన్‌మోహన్, చెరుకూరి సునీల్‌కుమార్, కారుమంచి చంద్రకుమార్, గర్లె దేవదానం, గురిందపల్లి వేమయ్య, కొమ్మెర్ల అంబేద్కర్, బేతాళ కిశోర్‌బాబు, బడుగు బుజ్జిబాబు, నక్కా కృపా సాగర్, జొన్నకూటి శ్యామ్‌కుమార్, గేరా రాజు పాల్గొన్నారు.



పాఠశాలలను సామాజిక చైతన్య కేంద్రాలుగా తీర్చిదిద్దాలి

నూతక్కి(మంగళగిరి): పాఠశాలలను సామాజిక చైతన్య కేంద్రాలుగా తీర్చిదిద్దాలని విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నూతక్కి విజ్ఞాన విహార విద్యాలయంలో ఆదివారం రాష్ట్ర స్థాయి వర్షారంబ సమావేశాలను విద్యా భారతీ ప్రాంత అధ్యక్షుడు జి.నాగేశ్వరరావు ప్రారంభించారు. సమావేశాలలో రానున్న విద్యా సంవత్సరానికి సంబంధించిన వార్షిక యోజన, పాఠశాల్లో ఉన్నత విద్యా ప్రమాణాలు నెలకొల్పడానికి చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. విద్య మాత్రమే సమాజంలో మనిషిని ఉన్నత స్థితికి చేరుస్తుందన్నారు. విద్య విలువ తెలుసుకుని రాణిస్తే మనిషి ఉన్నత స్థాయికి చేరడంతో పాటు భావితరాలకు ఆదర్శంగా నిలుస్తారన్నారు. కార్యక్రమంలో విద్యా భారతి రాష్ట్ర కార్యదర్శి జె.ప్రతాప్ సింహశాస్త్రి, సంఘటన కార్యదర్శి కన్నా భాస్కర్, ఉపాధ్యక్షుడు వెలగపూడి రామకృష్ణ, భారతి క్షేత్ర ప్రతిక్షణ ప్రముఖులు రావుల సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సామాజిక వేత్తలు

కార్మికులకు బకాయిలు చెల్లించాలి

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలను ఇప్పటికైనా చెల్లించాలని యూనియన్ నాయకుల స్టీవెన్ కోరారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ అక్రమ లాకౌట్ చేసిన దగ్గర నుంచి ఇప్పటి వరకు సుమారు 170 మంది మరణించారని ఆయన అన్నారు. అయినప్పటికీ యాజమాన్యంలో స్పందన లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కార్మికుల సమస్యపై దృష్టి సారించి పరిష్కరించే విధంగా కృషి చేయాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో గురవయ్య, దానయ్య, నవనీతం, ఇమాంబి, దుర్గాభవాని, ఆశీర్వాదం, నాగేశ్వరరావు, హగ్గయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో కార్మికులు, యూనియన్ నాయకులు

డ్రోన్ కెమెరాలతో నేరాల నియంత్రణ

మంగళగిరి టౌన్: గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు నేరాలను నియంత్రించేందుకు డ్రోన్ కెమెరాలను వినియోగిస్తున్నట్లు మంగళగిరి పట్టణ సీఐ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మంగళగిరి నగర పరిధిలోని పోలీస్‌స్టేషన్ నుంచి ఆదివారం డ్రోన్ కెమెరాతో పట్టణమంతా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరాలు జరిగేందుకు ఆస్కారమున్న నగరంలోని పలు ప్రాంతాలను ముందుగా గుర్తించి ఆయా ప్రాంతాల్లో నిఘా పెట్టేందుకు డ్రోన్‌లు వినియోగిస్తున్నామన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నేరాల కట్టడికి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. డ్రోన్ కెమెరాలు పోలీసుల సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుస్తుందన్నారు. ప్రముఖుల బందోబస్తులో కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్రైమ్ సిబ్బంది ఏడుకొండలు, బాబూరావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



డ్రోన్ కెమెరాను పరిశీలిస్తున్న పట్టణ సీఐ వినోద్‌కుమార్

నామమాత్రపు బడ్జెట్‌తో చేనేతలకు మొండిచెయ్యి

మంగళగిరి టౌన్: సీఎం చంద్రబాబు ఎడాది పాలనలో నామమాత్రపు బడ్జెట్‌తో చేనేతలకు మొండిచెయ్యి చూపారని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ విమర్శించారు. మంగళగిరి నగర పరిధిలోని ఆంధ్రప్రదేశ్ చేనేత సంఘం కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్లను అమలు చేయకుండా పవర్ లూమ్ యజమానులకు రాయితీలు ఇస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్పొరేట్ విధానాల్లో భాగంగా చేనేతను ధ్వంసం చేసేవిధంగా పవర్‌లూమ్‌లను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. ఈ సమస్యలపై అక్టోబర్ 2, 3 తేదీల్లో పల్నాడు జిల్లాలో రాష్ట్ర చేనేత మహాసభలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సభలను జయప్రదం చేయాలని చేనేత కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కామర్తి రాజు, రాష్ట్ర సహాయ కార్యదర్శి రామారావు, గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాలకృష్ణ